తాగునీటి కష్టాలు

- నాలుగు రోజులకు ఒకసారి సరఫరా
- పైపులైన్లలో మురుగునీరు
- వాటరు ట్యాంకులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి
- అధికారులు స్పందించాలని వినతి


కుళాయి వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

మచిలీపట్నంరూరల్: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. బందరు మండలం రుద్రవరం గ్రామ పంచాయతీ శివారు కృష్ణారావుపేట వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణారావుపేటలో సుమారు 250 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు రోజువారీ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ గ్రామానికి పంచాయతీ నుంచి వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సి ఉండగా నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు ఇస్తున్నారు. ముందుగా మురికి నీరు వస్తోంది. తరువాత తాగునీరు వచ్చినప్పటికీ తక్కువ సమయం కావటంతో ప్రజల అవసరాలకు ఉపయోగపడటం లేదు. ట్యాంకర్ రోజు విడిచి రోజు వస్తోంది. అది కూడా సమయపాలన లేకపోవటంతో కూలీ పనులను మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎస్టీ కాలనీలోనూ ఇదే పరిస్థితి..

ఎస్టీ కాలనీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ 5 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉన్నప్పటికీ ట్యాంకుకు నీరు చేరటం లేదు. సమీపంలో గొల్లపాలెం గ్రామానికి, ఎస్టీ కాలనీకి ఒకే సమయంలో నీరు విడుదల చేయటంతో ట్యాంకరు నింపుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో కాలనీవాసులు అరకిలోమీటరు దూరంలో వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.


నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

గతంలో ఇలా..

గత ప్రభుత్వ హయాంలో ప్రతిరోజూ తాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రతిరోజు గ్రామస్తులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయటంతో పాటు పైప్‌లైన్ ద్వారా కూడా నీరు సరఫరా అయ్యేలా అప్పటి మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) చర్యలు చేపట్టారు. మార్చి నెలలోనే ఇలా ఉంటే ముస్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సక్రమంగా నీరు సరఫరా అయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చి తమ సమస్య పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.

వచ్చే నీరు సరిపోవటం లేదు

వచ్చే నీరు సరిపోవటం లేదు. పైపుల లీకో మరే కారణమో ముందుగా మురుగు నీరు రావటంతో వదిలేయాల్సి వస్తోంది. చివరకు నాలుగు బిందెలు మాత్రమే పట్టుకోవాల్సి వస్తోంది. ఇవి కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి కలుషితం లేని నీటిని అందించాలి.

– పులివర్తి పాపారావు, గ్రామస్తుడు

ట్యాంకర్లు సరిగా రావటం లేదు

గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ట్యాంకరు సమయపాలన లేకుండా వస్తోంది. మేము కూలీ పనులకు వెళుతుంటాం. ట్యాంకరు వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి. ట్యాంకర్లు వచ్చే సమయాలు తెలియపరచాలి.

– ఉడుముల విమలకుమారి, గ్రామస్తురాలు

క్లుప్తంగా

భూముల రీ సర్వేపై గ్రామసభ

కృత్తివెన్ను: భూముల రీ సర్వేకు సంబంధించి జరిగిన సర్వేపై బుధవారం చెరుకుమిల్లిలో గ్రామసభ నిర్వహించారు. గత కొన్ని రోజులుగా దీనిపై సర్వే జరిపామని దీనికి సంబంధించి రైతులకు ఈ సభ ద్వారా నోటీసులు అందిస్తున్నట్లు తహసీల్దార్ సోమేశ్వరరావు తెలిపారు. సర్వేలో జరిగిన అంశాలపై తమ భూములకు సంభందించి ఏ విధమైన అనుమానాలున్నా స్థానిక వీఆర్‌వో దృష్టికి తీసుకువస్తే మళ్లీ తిరిగి సర్వే జరిపి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెరుకుమిల్లిని మోడల్ విలేజ్‌గా తీసుకుని సర్వే చేసినట్లు డీటీ శశికుమార్ తెలిపారు. ఎంఆర్ఐ మాధవీలత, సర్పంచ్ కృపావేణి రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల పంపిణీ

కృత్తివెన్ను: ప్రభుత్వాసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన చినపాండ్రాక పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినపాండ్రాక, లక్ష్మీపురం పీహెచ్‌సీలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఆయా పీహెచ్‌సీల వైద్యులు సూర్యతేజ, సాయిసందీప్‌లకు అందజేశారు. పేషెంట్లు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడే సమయంలో ఇవి ఉపయోగ పడతాయన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించాలి

పెడన: రేషన్ కార్డు కలిగిన వారంతా తప్పనిసరిగా ఆ కార్డులోని కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యులందరూ కలిసి సంబంధిత రేషన్ డీలరు వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే సంబంధిత కార్డు హోల్డ్‌లో పెట్టడం జరుగుతుందని, రేషన్ నిలిచిపోతుందన్నారు. ఈ నెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలని వినతి



కృత్తివెన్ను: ప్రభుత్వం అందజేసిన కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సంగముడి కాలనీలో రోడ్లు, డ్రైయినేజీతో పాటు శ్మశాన వాటిక సమస్య ఉందని దీనిపై ఎన్నిమార్లు తెలియజేసినా ఫలితం లేదన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జనచైతన్య యాత్రల్లో భాగంగా వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు ఆ పార్టీ ప్రతినిధులు పరుచూరి ధనశ్రీ, మాజేటి శ్రీనివాస్‌లు కాలనీ వాసులతో కలసి అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చల్లపల్లి: స్థానిక బైపాస్ రోడ్డులో రూ.4 లక్షల ఉపాధి హామీ నిధులతో కొత్త సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, వార్డు సభ్యులు మీర్ రిజ్వాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ అంతర్గత సిమెంటు రోడ్లు నిర్మిస్తున్న వారు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పీఎస్‌వీ వంశీకృష్ణ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

గూడూరు: పేకాడుతున్న 11 మంది వ్యక్తులను గూడూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని మల్లవోలు నుంచి పచ్చవారిలంక గ్రామానికి వెళ్లే డొంకరోడ్డు సమీపంలో కోత ముక్క ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,06,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 11 మందిపై ఏపీ గేమింగ్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. మండల పరిధిలో ఎవరైనా పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల ప్రతిభ



అవనిగడ్డ: విజయవాడలోని జోషితా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఇంటర్ జూడో కుంగ్ ఫూ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ క్రీడాకారులను బుధవారం సత్కరించారు. స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ లూర్దుమేరీ క్రీడాకారులను అభినందించి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లిలో మేము సైతం..


కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాల్లో మిజోరాం, తమిళనాడు విద్యార్థులు

స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాల్లో మేము సైతం సేవచేస్తామంటూ కేరళకు చెందిన బైబిల్ కాలేజీ విద్యార్థులు ముందుకొచ్చారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలతో కలిసి రోడ్లు శుభ్రపరిచారు. 3,424వ రోజు పనిలో భాగంగా బుధవారం పాగోలు రోడ్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బైబిల్ కళాశాలలో చదువుతున్న చోచో (మిజోరాం), శివబాలన్ (తమిళనాడు), అష్రల్లా(తమిళనాడు), శామ్యూల్ (కాకినాడ)లు 30 రోజుల ట్రైనింగ్‌లో భాగంగా చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీలో ఉన్న గ్రేస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఫాస్టర్ డేవిడ్ గోల్కొండ దగ్గరకు వచ్చారు. సోషల్ వర్క్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలతో కలిసి రోడ్లు శుభ్రం చేసినట్లు డేవిడ్ గోల్కొండ తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ స్వచ్ఛ సుందర చల్లపల్లికి తమ వంతు సేవ చేయటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

– చల్లపల్లి

మండల సీపీఎం కార్యదర్శిగా చిరివెళ్ల



మోపిదేవి: సీపీఎం మండల కార్యదర్శిగా చిరివెళ్ల రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోపిదేవిలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు, జిల్లా కౌలురైతు సంఘం నాయకులు పంచకర్ల రంగారావు సమక్షంలో మండల పార్టీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో రాజశేఖర్‌ను కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. తొలుత దివంగత కామ్రేడ్ గుంటూరు బాపనయ్యకు నివాళులర్పించారు. అనంతరం మండల కొత్తకమిటీ నియామకం చేపట్టారు. రాజశేఖర్‌తోపాటు కమిటీ సభ్యులుగా మరీదు సురేష్‌బాబు, బెజవాడ నాగేశ్వరావు, కర్ర వెంకటేశ్వరావు, పులివర్తి నాగమల్లేశ్వరావు, సహదేవుడు, బండి నిర్మల, కొమ్ము జయరావు నియమితులయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారంలో కమిటీ మరింత చురుగ్గా పని చేస్తుందని తెలిపారు. పార్టీ నాయకులు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం, ఆదాయం

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

ఘంటసాల: చిరు, తృణ, పప్పు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తుల వల్ల మహిళలకు ఆరోగ్యం, ఆదాయం చేకూరుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా మహిళలకు చిరు ధాన్యాలు, తృణ ధాన్యాలు పప్పు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ చిరు ధాన్యాలలో పోషకాలు ఎక్కువగా ఉండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, మహిళలు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నైపుణ్యం సాధించాలన్నారు. చిన్న కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుని ఆదాయం పొంది తద్వార ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి..మిక్సిడ్ అటుకుల లడ్డూ, రైస్ బ్రాన్ లడ్డూల తయారీ విధానాన్ని చూపించి మహిళలతో తయారు చేయించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, ఘంటసాలపాలెం గ్రామ మహిళలు పాల్గొన్నారు.


రైస్ బ్రాన్ లడ్డూలను తయారు చేసి చూపిస్తున్న గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి

ముగిసిన అలంకరణ చేపల పెంపకం శిక్షణ

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అలంకరణ చేపల పెంపకం, యాజమాన్య పద్ధతుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ ఇన్‌చార్జి జె.యశ్వంత్ కుమార్, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ముందు ముందు అలంకరణ చేపల పెంపకం ఒక ఉపాధిగా మలుచుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ యువతకు సమన్వయకర్త చేతుల మీదగా ధ్రువ పత్రాలను అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, గ్రామీణ యువత పాల్గొన్నారు.

చిన్నారుల నవమి సందడి



కోడూరు: 'రాములోరు వచ్చారు.. రామ భజన'.. అంటూ చిన్నారులు గ్రామాల్లో చిడతలు మోగ్రిస్తూ సందడి చేస్తున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో పిల్లలు వేపగుళ్లు కట్టుకొని అందులో సీతా రామచంద్ర స్వామివార్ల చిత్రపటాన్ని పెట్టి ఇంటింటా తిరడం అనాధిగా వస్తోంది. శ్రీ రామనవమికి పది రోజుల ముందు నుంచి చిన్నారులు నవమి విశిష్టతను వివరిస్తూ గ్రామాల్లో సందడి చేస్తున్నారు. వేపగుడిలో స్వామివార్ల చిత్రపటం ముందు దీపం వెలిగించి ప్రతి ఇంటికీ తీసుకువెళ్లడంతో పాటు అక్కడ రాములోరి పాటలు ఆలపిస్తున్నారు. మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో చిన్నారులు ఇలా వేపగుడిలో రాములోరిని ఊరేగిస్తూ కనిపించారు.

చెత్త బుట్టల పంపిణీ

మచిలీపట్నంరూరల్: మండల పరిధిలోని కానూరు, శివారు గ్రామాలైన చిన్నకానూరు, కొత్తిళ్లు, గణపబత్తుల కానూరు గ్రామాల్లో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ బుధవారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలందరికీ తడి, చెత్త పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు ఈ చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్నామన్నారు. చెత్తను డస్ట్ బిన్‌లో వేయాలని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, వీర చిన్న, ఈవన వెంకన్న, జొన్నల నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ఘంటసాల: తడి, పొడి చెత్తపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు తడి, పొడి చెత్త సేకరణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల ద్వారా అక్కడి ప్రజలకు, మహిళలకు తడి, పొడి చెత్త సేకరణ, నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి క్లాప్ మిత్రలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిట్టూర్పు పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద వానపాముల ఎరువుతో తయారు చేసిన ఆకు కూరలను ఈవో శ్రీలక్ష్మి ప్రదర్శించారు. చినకళ్లేపల్లి, మల్లంపల్లి, కొడాలి, మల్లాయి చిట్టూరు, శ్రీకాకుళం, ఘంటసాలపాలెం గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ పనులను పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ నయూమ్, నాగమణి, శిరీష, శ్రీనివాసరావు, అర్జునరావులు పర్యవేక్షించి ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు శ్రీకాకుళం ఉప సర్పంచ్ ఎన్నిక

ఘంటసాల: మండలంలోని శ్రీకాకుళం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కె.వెంకటేశ్వరరావు బుధవారం సాయంత్రం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ సర్పంచ్‌తో పాటు 12 వార్డులు గెలుపొందింది. అయితే రెండున్నర సంవత్సరాలు బోడి శివ ఆంజనేయులు ఉపసర్పంచిగా పనిచేసి అనంతరం రాజీనామా చేయగా ఇప్పటి వరకు ఖాళీగా ఉంది.

వైఎస్సార్ సీపీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతి


సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి నిరంతరం పాటిపడిన పార్టీ వైఎస్సార్ సీపీ అని మచిలీపట్నం దళిత సంఘ నాయకుడు ఎగ్గోని గాంధీ అన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దళిత సంఘ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. అలాంటి గొప్ప నాయకుడిని పట్టుకుని మచిలీపట్నం పర్యటనకు వచ్చిన టీడీపీ నాయకురాలు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సమంజసం కాదన్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పట్ల అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. దళిత సంఘ నాయకుడు బేతపూడి రవి మాట్లాడుతూ ఎస్సీలకు సాయం అందించే విషయంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఆ విషయాన్ని కేంద్ర గణాంకాలే చెబుతుండటం గమనార్హమన్నారు. విషయ పరిజ్ఞానం లేని ఉండవల్లి శ్రీదేవి తమ నాయకుడి పట్ల వ్యంగ్యంగా మాట్లాడటం చూస్తుంటే నవ్వు వస్తుందన్నారు. గూడవల్లి నాగరాజు మాట్లాడుతూ 2022– 23 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 51.91 లక్షల కుటుంబాలకు సాయం అందించిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించటం అందుకు నిదర్శనమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రూ.1,844 కోట్లు ఖర్చు చేసి 9,260 ఎండీయూ వాహనాలను నిరుద్యోగులకు అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీదన్నారు. పేదవర్గాల అభ్యున్నతి, వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఉండవల్లి శ్రీదేవి మాటలను అదుపులో పెట్టుకుని మాట్లాడటం మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు వై.నాగేశ్వరరావు, చీలి చక్రపాణి, రాంప్రసాద్, గడిదేశి రాజు, భూపతి అంబేడ్కర్, దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశీల వసూలుకు వేలం

రూ.25.09 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

పెడన: పురపాలక సంఘ పరిధిలో పూలు, పండ్లు, కూరగాయాల మార్కెట్, మత్స్యమాంసాదుల మార్కెట్, వారపు సంతలో ఆశీలు వసూళ్లకు నిర్వహించిన వేలం ద్వారా పురపాలక సంఘానికి రూ.25.09 లక్షల ఆదాయం రానున్నది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అధ్యక్షతన ఆశీలు వసూళ్లకు బుధవారం ఉదయం బహిరంగ వేలం నిర్వహించారు. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31, 2026 వరకు ఆశీలు వసూళ్ల చేసుకునే అవకాశం కల్పించడానికి ఈ వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు పాటదారులకు తెలిపారు. అబ్దుల్ హై, వాజీదున్నీసా, రౌతుల ప్రసాద్‌లు రూ.2 లక్షలు చొప్పున డిపాజిట్‌లు కట్టి వేలంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాట రూ.19.76 లక్షలకు నిర్ణయించి వేలం ప్రారంభించారు. చివరకు వాజిదున్నీసా రూ.25.09 లక్షలకు ఆశీలు వసూళ్లను దక్కించుకున్నారు. నిరుడు ఈ ఆశీలు రూ.22.50 లక్షలకు పోయింది. అదీ కాకుండా ఈ ఏడాది జీఎస్టీ 18 శాతం పెరగడంతో పాటు స్వీపింగ్ చార్జీలు కలిపి మొత్తం పాటదారుడు రూ.32,72,140 చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ అధికారులు హక్కులు దక్కించుకున్న వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఆర్ఐ.పామర్తి వెంకటేశ్వరరావు, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రధాన జాతరోత్సవాలు ప్రారంభం

నేడు పోలీస్‌స్టేషన్‌కు గంగాభవానీ అమ్మవారు


ముస్తాబైన గంగాభవానీ అమ్మవారి ఆలయం

కోడూరు: ఆలయంలో భక్తులచే పూజలందుకోవాల్సిన గంగాభవానీ అమ్మవారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తొలిపూజలు అందుకోనున్నారు. గురువారం నుంచి అమ్మవారి జాతరోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం చిన్నఅమ్మవారిని పోలీసు లాంఛనాలతో స్టేషన్‌కు తీసుకువెళ్లనున్నారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్ నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన పోలీసులు అమ్మవారిని డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా స్టేషన్‌కు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి రాకను పురస్కరించుకొని పోలీస్‌స్టేషన్‌ను ముస్తాబు చేశారు. స్టేషన్‌కు నూతన శోభగులద్ది, టెంట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కోడూరు ఎస్ఐ చాణిక్య, పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి దంపతులు తొలిపూజలు చేయనున్నారు.

31న ప్రధాన గుడిజాతర..

పోలీసుల తొలిపూజలకు ముందు అమ్మవారికి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు పసుపు, కుంకుమను సమర్పిస్తారని ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. అనంతరం స్టేషన్‌లో పూజలు చేసి, గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. కోడూరుతో పాటు శివారు గ్రామాలైన స్వతంత్రపురం, దింటిమెరక, మెరకగౌడపాలెం, కృష్ణాపురం, యర్రారెడ్డి వారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని యుగంధరరావు తెలిపారు. 30న పసువుల జాతర, 31న అమ్మవారి ప్రధాన గుడి జాతరను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని నూతన రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సారా తయారు చేసినా, అమ్మినా ఇబ్బందులు తప్పవు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామశేషయ్య

పెడన: సారా తయారు చేయడం, అమ్మడం వంటి వాటి జోలికి పోవద్దని, అలా చేస్తే కఠిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐ ఎం.రామశేషయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని నందమూరు పంచాయతీ కోటవానిపాలెం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారు, అమ్మడం వల్ల కలిగే అనర్థాలు, శిక్షలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఆ దిశగా అడుగులు వేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రస్తుతం అలాంటి కార్యకలాపాలు ఏమీ తమ గ్రామంలో జరగడం లేదని గ్రామస్తులు ఆనందంగా బదులిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ


ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును సత్కరిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

మచిలీపట్నంటౌన్: ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'ఢై అఖర్ నేషనల్ లెవెల్ ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక మాస్టర్ ఇ.కే బాలభాను విద్యాలయానికి చెందిన ఉపాధ్యాయుడు ఆర్. కోటేశ్వరరావు ప్రథమ బహుమతిని పొందారు. పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు బుధవారం స్థానిక మాస్టర్ ఇ.కే.బాలభాను విద్యాలయం ప్రాంగణానికి విచ్చేసి జాతీయ స్థాయిలో గెలుపొందిన ఉపాధ్యాయుడు కోటేశ్వరరావుకు రూ. 25 వేల నగదు బహుమతి, ధ్రువీకరణ పత్రాలను అందజేసి సత్కరించారు. విద్యాలయం కరస్పాండెంట్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో ఇరువర్గాల దాడి


ఎస్సీ ఏరియాలో పోలీస్ పికెట్ పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

మోపిదేవి: స్థానిక ఎస్సీ కాలనీలో ఇరువర్గాల మధ్య వివాదం పెరిగి దాడి చేసుకునే పరిస్థితికి దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అర్జా సుబ్రహ్మణ్యం గత కొంత కాలంగా కొట్టివేసిన కొబ్బరి బొండాలు ఖాళీ ప్రదేశంలో ఆరపెడుతున్నాడు. పక్కనే నివాసం ఉంటున్న గుంటూరు శ్రీనివాసరావు ఆ ప్రదేశంలో వేయవద్దంటూ కొంత కాలంగా అడ్డుకుంటున్నారని తెలిపారు. బుధవారం సాయంత్రం ఎండిన డొక్కలు తీసుకునేందుకు వెళ్లిన సుబ్రహ్మణ్యం భార్యతో గొడవపడ్డారు. ఇది చూసిన సుబ్రహ్మణ్యం కుమారుడు మణికంత కూడా ఘటనా స్థలానికి వెళ్లడంతో శ్రీనివాసరావు ఇద్దరు కుమారులు గుంటూరు బాల మురళి, గుంటూరు అశోక్‌కుమార్ గొడవ పడి ఇరువర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. ఇదే సమయంలో సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యం కత్తితో దాడి చేయడంతో బాల మురళికి తలకు, అశోక్‌కుమార్‌కు చేతిపై గాయాలు అయినట్లు తెలిసింది. గ్రామస్తుల సమాచారంతో 108లో క్షతగాత్రులను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

29న రీసర్వే 9(2) నోటీసు మేళా

కోడూరు: మండలంలోని పిట్టల్లంక పంచాయతీ ఈ నెల 29న భూముల రీసర్వే 9(2)కు సంబంధించి నిర్వహించే నోటీసు మేళాకు రైతులందరూ హాజరుకావాలని తహసీల్దార్ శ్రీనునాయక్ బుధవారం తెలిపారు. పిట్టల్లంక పంచాయతీలో భూమి కలిగిన ప్రతి యజమాని సంబంధిత మాగాణి, మెట్ట భూములకు సంబంధించిన దస్తావేజులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, బ్యాంక్ ఎకౌంట్, ఆధార్ జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలతో ఈ మేళాకు హాజరు కావాలన్నారు. సచివాలయం వద్ద ఉదయం 10గంటల నుంచి నోటీసు మేళా జరుగుతుందన్నారు.